VC NEWS
# వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...
TELUGU DAILY NEWS
www.veguchukkanews.com
నిజామాబాద్ బుధవారం 12 జూన్ 2024
వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:01 సంచిక: 328



హైదరాబాద్‌లో దంచికొట్టిన వాన
3లో

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

***ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగస్టు 15లోగా తెలంగాణలో రైతులకు రూ. 2 లక్షల వరకు పంట రుణాల మాఫీ చేసి తీరాల్సిందేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు సమావేశంలో సీఎం రేవంత్,ఉపముఖ్యమంత్రి భట్టి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి***



# ఆగస్టు 15లోగా రుణమాఫీ చేసి తీరాల్సిందే

హైదరాబాద్: ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగస్టు 15లోగా తెలంగాణలో రైతులకు రూ. 2 లక్షల వరకు పంట రుణాల మాఫీ చేసి తీరాల్సిందేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. దీనికి సంబంధించి విధివిధానాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రూ.2 లక్షల వరకు రుణాలున్న రైతుల జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. బ్యాంకర్ల నుంచి పూర్తిస్థాయిలో రైతుల రుణాల వివరాలు సేకరించి అర్హులను గుర్తించాలన్నారు. రుణమాఫీకి అవసరమైన వ్యయాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించాలని నిర్దేశించారు. కటాఫ్ తేదీ విషయంలో సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పంట రుణమాఫీ, ఇతర అంశాలపై సోమవారం వ్యవసాయ, సహకారశాఖల అధికారులతో సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీకి విధివిధానాలను రూపొందించి స్పష్టమైన ప్రణాళికతో ముందుకు రావాలని అధికారులకు సూచించారు. కేవలం బ్యాంకుల నుంచే కాకుండా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) నుంచి పంట రుణాలు తీసుకున్న రైతుల వివరాలు కూడా అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. రుణమాఫీ కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధుల సమీకరణ, కటాఫ్ తేదీ, కుటుంబంలో ఒకరి కంటే ఎక్కువ మంది రుణగ్రహీతల విషయంలో ఏం చేయాలి.. తదితర అంశాలపైనా ఈ సందర్భంగా సమాలోచనలు చేశారు. రైతు భరోసా, పంటల బీమా తదితర అంశాలపైనా చర్చించినట్లు తెలిసింది.




## విద్యుత్ కొనుగోళ్ల దర్యాప్తు కెసిఆర్‌కు నోటీసులు జారీ
2లో



## తెలంగాణ ఎడ్‌సెట్ ఫలితాలు విడుదల
96.90 శాతం మంది అభ్యర్థులు అర్హత
2లో

వామ్మో జూన్
ఆందోళనలో తల్లిదండ్రులు




# మళ్లీ ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల మోత
2లో

## సిఎం రేవంత్‌తో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న భేటీ



హైదరాబాద్: పట్టభద్ర ఎమ్మెల్సీగా గెలిచిన తీన్మార్ మల్లన్న సిఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. నల్గొండ - వరంగల్ - ఖమ్మం శాసన మండలి పట్టభద్రుల నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా విజయం సాధించిన చింతపండు నవీన్ కుమార్ (తీన్మార్ మల్లన్న) మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవలి ఎన్నికల్లో ఆయన ఎమ్మెల్సీగా గెలుపొందారు. ఈ సందర్భంగా సిఎంకు కృతజ్ఞతలు తెలిపారు.



# నేడే చంద్రబాబు ప్రమాణ స్వీకారం



ముస్తాబైన వేదిక ప్రముఖుల రాక నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రత
60 మందికిపైగా ఐపీఎస్‌ల పర్యవేక్షణ దారులన్నీ కేసరపల్లికే..!
ప్రమాణ స్వీకార కార్యక్రమ వేదిక

**అమరావతి:** చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవానికి ఏర్పాట్లు మంగళవారం సాయంత్రానికి పూర్తయ్యాయి. కృష్ణాజిల్లా కేసరపల్లిలో సభాప్రాంగణం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఏపీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాలుగోసారి బుధవారం మధ్యాహ్నం 11.27 గంటలకు ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, పలువురు కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల సీఎంలు, అగ్రనటులు చిరంజీవి, రజనీకాంత్ తదితరులు వస్తుండడంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. గన్నవరం మండలం కేసరపల్లిలో సభ కోసం 11.18 ఎకరాలను సిద్ధం చేశారు. 36 గ్యాలరీల్లో అందరికీ వేదిక కనిపించేలా ఎల్‌ఈడీ తెరలను ఏర్పాటుచేశారు. వీఐపీల కోసం ప్రత్యేకంగా నాలుగు గ్యాలరీలు సిద్ధం చేశారు.

**చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవానికి ఏర్పాట్లు మంగళవారం సాయంత్రానికి పూర్తయ్యాయి. కృష్ణా జిల్లా కేసరపల్లిలో సభాప్రాంగణం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది.**



## సెలవులకు టాటా.. ఇక బడిబాట!

నేడు పాఠశాలల పునఃప్రారంభం

విద్యార్థులకు ఘనంగా స్వాగతం పలికేలా ఏర్పాట్లు

తొలిరోజే పాఠ్య పుస్తకాలు, యూనిఫాం అందజేత

రాష్ట్రంలో వేసవి సెలవుల అనంతరం ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలు బుధవారం తెరచుకోనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 60 లక్షల మంది విద్యార్థులు 48 రోజుల అనంతరం బడిబాట పట్టనున్నారు.
3లో

## ప్రియాంక పోటీ చేసివుంటే మోడీ ఓడిపోయేవారు
**రాయబరేలి పర్యటనలో రాహుల్ సంచలన వ్యాఖ్య**



3లో



2లో

## స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టండి






# స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టండి

## అధికారులకు మంత్రి పొన్నం ఆదేశాలు



**హైదరాబాద్:** తెలంగాణ వ్యాప్తంగా పాఠశాల బస్సుల ఫిట్‌నెస్‌పై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను బలోపేతం చేసి చెక్ పోస్టుల వద్ద నిరంతర నిఘా ఉంచాలని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలల్లో రహదారి భద్రతపై అవగాహన కల్పించేలా ప్రత్యేక ఏర్పాట్లు ఉంటేనే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇవ్వాలని సూచించారు. మంగళవారం రవాణాశాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రతి స్కూల్ బస్సు తనిఖీ చేయాలని, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఉంటేనే రోడ్డు ఎక్కేలా చూడాలని చెప్పారు. వారం రోజులపాటు స్కూళ్లు, కాలేజీల్లో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. 'కారు డోర్‌లకు బ్లాక్ ఫిల్మ్ గ్లాస్ ఉన్న వాటిపై విధిగా తనిఖీలు నిర్వహించాలి. రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద ఉన్న ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను మరింత బలోపేతం చేస్తే అవినీతికి ఆస్కారం లేకుండా ఆదాయం పెంచుకోవచ్చు. సీజ్ చేసిన వాహనాలకు సంబంధించి పాలసీలో ఉన్న విధంగా వ్యవహరించాలి. వాహనాలను భద్రపర్చే ప్రదేశాలపై జిల్లా పోలీస్ అధికారులతో కో-ఆర్డినేట్ చేసుకోవాలి. హైదరాబాద్‌లో ఆటోరిక్షాలపై ప్రస్తుతం ఉన్న పాలసీతో పాటు సీఎన్జీ, ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించేలా రూపొందించాలి' అని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# మళ్లీ ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల మోత



**నిజామాబాద్:** జూన్ అంటేనే మధ్య తరగతి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఈ నెలలోనే విద్యాసంస్థలు, వ్యవసాయపనులు ప్రారంభమవుతాయి. ఈ నెల 12 నుంచి కొత్తవిద్యాసంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో పిల్లల చదువుకు పెట్టే ఖర్చులపై తల్లిదండ్రులు బేరీజు వేసుకుంటున్నారు. కొత్తగా అడ్మిషన్ తీసుకునేవారు ప్రైవేటు విద్యాసంస్థలు వసూలు చేస్తున్న అడ్మిషన్, డొనేషన్ ఫీజులు చూసి జంకుతున్నారు. ఇదివరకే చదువుతున్న విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం తదితర వస్తువుల కొనుగోలుతో తల్లిదండ్రులకు జేబులకు చిల్లుపడనుంది. దీంతో 'వామ్మో జూన్' అంటూ తలపట్టు కుంటున్నారు. ఒక వైపు తమ పిల్లలను ఏ పాఠశాలలో చేర్పించాలి, ఏయే స్కూల్‌లో ఏ స్థాయి ఫలితాలు వచ్చాయి, తదితర అంశాలపై తల్లిదండ్రులు విశ్లేషించుకుంటున్నారు. జిల్లాలోని ప్రైవేట్ స్కూళ్లు, కళాశాలల్లో ఫీజులు చుక్కలనంటుతున్నాయి. బుక్స్, యూనిఫాం, పెన్నులు, పెన్సిల్ ఇతరాత్ర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి. మరోవైపు వానాకాలం సీజన్ మొదలవ్వడంతో రైతులు పెట్టుబడుల కోసం తిప్పలు పడుతున్నారు. విత్తనాలు, ఇతర ఖర్చులకు డబ్బుల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తూనే బ్యాంకర్ల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. దీంతో ఈనెల ఎలా గట్టేక్కుతుందా అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పేద, మధ్య తరగతి కుటంబీకుల జేబులకు చిల్లుపడే మాసం వచ్చేసింది. జిల్లావ్యాప్తంగా సుమారు 600 పైగా ప్రైవేట్ పాఠశాలల్లో వాటి విద్యాప్రమాణాలు, ఇతర అంశాలతో కూడిన స్థాయిని బట్టి ఏడాదికి రూ.10 వేల నుంచి మొదలుకొని రూ.లక్షకు పైగా ఫీజులున్నాయి. అందులోనూ ఐఐటీ, ట్యూషన్, సాంస్కృతిక, కరాటే తదితర అంశాలు నేర్పించేందుకు అదనంగా రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు ప్రైవేట్ స్కూళ్లు వసూలు చేస్తున్నాయి. వీటిలో కొన్ని తోకల పేరుతో 1వ తరగతికే రూ.లక్షల్లో వసూలు చేయడం విశేషం. కొన్ని పాఠశాలలైతే నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నాయి. అప్పు చేసైనా ప్రైవేట్ స్కూల్ అనేది వేళ్లానుకోవడంతో దిగువ, మధ్య తరగతి జనం కూడబెట్టుకున్న దానికి మరికొంత అప్పు చేసి పిల్లలను కార్పొరేట్ స్కూళ్లలో చేర్పిస్తున్నారు. ఏటా రైతులకు వానాకాలం సీజన్ భారంగా మారుతోంది. ఈ యాసంగి పంటలు పండినా ధాన్యం డబ్బు చేతికి రాని దైన్య స్థితిలో రైతులు ఉ న్నారు. వ్యవసాయ పనులూ అంతంతే. ఇతరత్రా కూలీ పనులు దొరక్క గ్రామీణుల్దు ఉపాధి పనుల కు వెళ్లినా కొద్ది రోజులుగా డబ్బులు అందక వారి పరిస్థితి గందరగోళంగా ఉంది. మండుతున్న ఎండల్లో ఉపాధి పనులకు వెళ్తే రూ.200 నుంచి రూ. 250 వరకు దక్కడం లేదు. ఈ పరిస్థితుల్లో ఖరీ ఫ్‌నకు సంబంధించి ఎరువులు, విత్తనాల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకుల్లో సరిపడా రుణాలు లభించక అప్పు చేయక తప్పని పరిస్థితి నెలకొంది. పిల్లల చదువు, వ్యవసాయ ఖర్చులు అంచనా వేయలేని స్థితి ఏర్పడడంతో పేద, మధ్య తరగతి ప్రజల్లో ఆందోళన నెలకొంది.

# గడీల పాలన నుంచి విముక్తి

## తట్టుకోలేక పోతున్న పింక్ మీడియా దుష్ప్రచారం చేస్తే చట్టబద్దంగా చర్యలు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ హెచ్చరిక

**హైదరాబాద్:** తెలంగాణలో పదేండ్లు గడీల పాలన సాగిందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. సీఎం రేవంత్ వచ్చాకా గడీల పాలనకు స్వస్తి పలికారని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చాక ప్రజా పాలన వచ్చిందన్నారు. ఏసీలకు అలవాటు పడ్డ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. పింక్ మీడియా అసత్యపు ప్రచారం చేస్తుందని విమర్శించారు. కొత్త యూట్యూబ్ ఛానల్స్ పెట్టి నెలకు మూడు లక్షలు ఇస్తున్నారని అన్నారు. గతంలో నే క్రిశాంక్ ఫేక్ జీవోలు తయారు చేసి జైల్లోకి పోయిండని గుర్తు చేశారు. టీఎస్ కు బదులు టీజీగా మార్చినందుకు వేలకోట్లు ఖర్చు అవుతున్నాయని ప్రచారం చేస్తున్నారని తప్పుడు పేపర్లు జీవో కాపీలు తయారు చేసి ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై పోలీసులకు పిర్యాదు చేశామన్నారు. ఈ విషయంలో డీజీపీ వద్ద తేల్చుకుందాం రండని సవాల్ విసిరారు. ఏదైనా సమస్య ఉంటే ప్రజా దర్బార్ ఉంది చెప్పండని సూచించారు. బాధ్యత గల జర్నలిస్టులు కొందరు తప్పుగా వ్యవహరిస్తున్నారని బల్మూరి వెంకట్ అన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు కొన్ని యూట్యూబ్ ఛానల్స్ పెట్టి దుమ్మెత్తి పోస్తున్నారని తప్పుడు పత్రాలు సృష్టించి బీఆర్ఎస్ అఫిషియల్ అకౌంట్స్ లలో పెట్టి నిజమని నమ్మిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం తప్పు చేస్తే విమర్శించండి. తప్పుడు ప్రచారాలు చేయకండని సూచించారు. గురుకుల, ఏఈఈ అభ్యర్థులు ఆందోళన పడకండని కొందరు రాజకీయ లబ్ది కోసం విద్యార్థులను, నిరుద్యోగులను రెచ్చగొడుతున్నారని చెప్పారు. గత ప్రభుత్వం చేసిన తప్పులు ఒక్కొక్కటి సరి చేస్తున్నామని తెలిపారు. ఒక్క ఇబ్బంది కలగకుండా గ్రూప్ 1 పరీక్ష నిర్వహించామని చెప్పారు బల్మూరి వెంకట్.

# గొర్రెల స్కామ్‌లో కొనసాగుతున్న విచారణ

**పరారీలో ఉన్న కంట్రాక్టర్ మొహియొద్దీన్**

హైదరాబాద్: తెలంగాణలో గొర్రెల స్కామ్ దర్యాప్తులో ఏసీబీ అధికారులు దూకుడు పెంచారు. నిందితులను ఏసీబీ అధికారులు కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు. రెండవరోజు మంగళవారం మాజీ పశు సంవర్ధక శాఖ ఎండీ రాంచందర్ నాయక్, ఓఎస్డీ కళ్యాణ్ లను విచారించారు.. మొదటిరోజు సోమవారం కస్టడీ విచారణలో రామచందర్.. నోరు మెదపలేదు. అలాగే ఓఎస్డీ కళ్యాణ్ కూడా విచారణకు సహకరించలేదు. గొర్రెల స్కీము యూనిట్ కాస్ట్ పెంపు, దళారుల ప్రమేయంపై ఏసీబీ అధికారులు విచారణ చేస్తున్నారు. ఎవరి ప్రమేయంతో దళారి, భోగస్ కంపెనీతో గొర్రెలను రైతులకు కొనుగోలు చేసి ఇవ్వాలని ఆదేశించారన్న కోణంలో విచారణ కొనసాగుతోంది. రామచందర్, కళ్యాణ్‌లను ఎదురెదురుగా కూర్చోబెట్టి విచారిస్తున్నారు. ఈరోజు కస్టడీ విచారణలో రాజకీయ నాయకుల పాత్ర, ఓఎస్డీ కళ్యాణ్ ఫైల్స్ తరలింపు, కాల్చివేత వీటన్నింటిపై ఏసీబీ అరా తీస్తోంది. కాగా జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉన్న పశు సంవర్ధక శాఖ మాజీ ఎండీ రామ్ చందర్ నాయక్.. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాజీ ఓఎస్డీ కళ్యాణ్ కుమార్‌లను మూడు రోజులపాటు ఏసీబీ కస్టడీకి కోర్టు అనుమతించింది. దీంతో సోమవారం వారిని కస్టడీలోకి తీసుకుని అధికారులు విచారించారు. కాగా గొర్రెల స్కామ్‌లో ఇప్పటికే 10 మందిని నిందితులుగా గుర్తించి పలువురిని అరెస్ట్ చేశారు. గొర్రెల స్కామ్‌లో మొదట రూ. 2.10 కోట్లు దారి మళ్ళినట్టు గుర్తించారు. పశు సంవర్ధక శాఖ మాజీ డైరెక్టర్ రామ్ చందర్ నాయక్ , ఓఎస్డీ కళ్యాణ్ అరెస్ట్‌తో రూ.700 కోట్ల స్కామ్ జరిగినట్లు ఏసీబీ గుర్తించింది. దీనికి సంబంధించి కీలక ఆధారాలు సేకరించింది. కస్టడీ విచారణలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. కాంట్రాక్టర్ మోహినూద్దిన్ పరారీలో ఉన్నాడు. అతని కోసం పోలీసులు గాలిస్తున్నారు.

# విద్యుత్ కొనుగోళ్ల దర్యాప్తు కెసిఆర్‌కు నోటీసులు జారీ

**హైదరాబాద్:** తెలంగాణలో విద్యుత్ కొనుగోళ్ల అంశంలో దర్యాప్తు వేగంగా సాగుతోంది. ఈ క్రమంలో మాజీ సీఎం కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చినట్లు జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి తెలిపారు. యాదాద్రి విద్యుత్కేంద్రం నిర్మాణం, ఛత్తీస్‌గఢ్ కరెంటు కొనుగోలుకు గత ప్రభుత్వం అనుసరించిన విధానంపై విచారణకు ఏర్పాటైన జస్టిస్ నరసింహారెడ్డి జ్యుడిషియల్ కమిషన్ విచారణ కొనసాగుతోంది. ఈ అంశంలో కేసీఆర్, సురేశ్ చందా, అజయ్ మిశ్రా సహా 25 మందికి నోటీసులు ఇచ్చినట్లు జస్టిస్ నరసింహారెడ్డి

పేర్కొన్నారు. వివరణ ఇచ్చేందుకు కేసీఆర్ జులై 30 వరకు సమయం అడిగారని చెప్పారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో.. పదేళ్లు సీఎంగా ఉన్న సమయంలో విద్యుత్ కొనుగోళ్లు, ఒప్పందాలకు సంబంధించిన విషయాలపై.. మీ పాత్ర ఏంటో చెప్పాలంటూ పవర్ కమిషన్ నోటీసులు జారీ చేసింది. 2024, జూన్ 30వ తేదీలోపు కేసీఆర్ సమాధానం ఇవ్వాలంటూ నోటీసుల్లో స్పష్టం చేసింది పవర్ కమిషన్. దీనిపై కేసీఆర్ బృందం స్పందించిందని.. జూలై 30వ తేదీలోపు సమాధానం ఇవ్వటానికి సమయం కావాలని కేసీఆర్ కోరినట్లు కమిషన్ వెల్లడించింది. జూన్ 30వ తేదీలోపు సమాధానం చెప్పాలని కమిషన్ స్పష్టం చేసింది. కేసీఆర్ ఇచ్చే సమాధానం సంతృప్తిగా లేకపోతే ప్రత్యక్ష విచారణకు పిలుస్తామని కమిషన్ వివరించింది. జూన్ 30వ తేదీలోపు లిఖితపూర్వక సమాధానం ఇవ్వాల్సి ఉంది కేసీఆర్.. ఆ సమాధానంపై కమిషన్ సంతృప్తి చెందకపోతే.. నేరుగా విచారణకు కేసీఆర్ హాజరుకావాల్సి ఉంటుంది . భద్రాద్రి, యాదాద్రి, ఛత్తీస్ ఘడ్ విద్యుత్ ఒప్పందాలపై అప్పటి సీఎంగా కేసీఆర్ పాత్రపై ఉన్న అనుమానాలు, లోగుట్టుపై ఉన్న సందేహాలకు కేసీఆర్ సమాధానం చెప్పాల్సి ఉంటుంది.

# తెలంగాణ ఎడ్‌సెట్ ఫలితాలు విడుదల

## 96.90 శాతం మంది అభ్యర్థులు అర్హత

**హైదరాబాద్:** తెలంగాణ ఎడ్‌సెట్ ఫలితాలు విడుదలయ్యాయి. మంగళవారం మధ్యాహ్నం ఫలితాలను ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, ఎంజీ వర్సిటీ ఇంఛార్జి విసి నవీన్ మిట్టల్ విడుదల చేశారు. మొత్తం 96.90 శాతం మంది అభ్యర్థులు అర్హత సాధించారు. రెండేళ్ల బీఈడీ కోర్సులో ప్రవేశాల కోసం టీజీ ఎడ్‌సెట్ పరీక్షను మే 23న నిర్వహించారు. ఈ పరీక్షకు మొత్తం 33,879 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. మొత్తం 29, 463 మంది అభ్యర్థులు హాజరయ్యారు. కాగా.. ఈసారి ఎడ్‌సెట్ పరీక్షలను నల్గొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ నిర్వహించింది. రాష్ట్రంలోని బీఈడీ కాలేజీల్లో మొత్తం 14, 285 బీఈడీ సీట్లు అందుబాటులో ఉన్నాయి. అధికారిక వెబ్‌సైట్‌లో ఫలితాలను అందుబాటులో ఉంచారు. అభ్యర్థులు తమ ఎడ్‌సెట్ హాల్‌టికెట్ నెంబరు, పుట్టినతేదీ వివరాలు నమోదుచేసి ర్యాంకు కార్డు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఎడ్‌సెట్ ప్రవేశ పరీక్షలో మొత్తం 96.90 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. గతేడాది ఎడ్‌సెట్ పరీక్షకు 27,495 మంది అభ్యర్థులు హాజరుకాగా.. 26,994 అభ్యర్థులు (98.18శాతం ) ఉత్తీర్ణత సాధించిన సంగతి తెలిసిందే.

ఈ ఏడాది మే 23న రెండు సెషన్లలో టీజీఎడ్‌సెట్-2024 పరీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సెషన్‌లో, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రెండో సెషన్‌లో ప్రవేశపరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు మొత్తం 33,879 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. మొదటి సెషన్‌లో నిర్వహించిన పరీక్షకు 16,929 మందికి గానూ 14,633 మంది, రెండో సెషన్ 16,950 మందికి గానూ 14,830 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మొత్తం 87శాతం హాజరు శాతం నమోదైంది. ఈ ఏడాది నల్గొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఎడ్‌సెట్ పరీక్షల బాధ్యత

చేపట్టింది. ఎడ్‌సెట్ ప్రవేశ పరీక్ష ద్వారా రెండేళ్ల బీఎడ్ కోర్సులో ప్రవేశాలు కల్పిస్తారు. రాష్ట్రంలోని బీఈడీ కళాశాలల్లో మొత్తం 14285 బీఈడీ సీట్లు అందుబాటులో ఉన్నాయి.

# గ్రంధాలయలాను ఆధునీకరించాలి

**హైదరాబాద్:** రానురాను గ్రంథాలయాల ప్రాధాన్యం తగ్గుతోంది. ఇంటర్‌నెట్ అందుబాటులోకి వచ్చాక గ్రామాల్లో వీటిపై పెద్దగా ఆసక్తి చూపడం లేదు. గ్రామీణ ప్రాంతాలలో కూడా గ్రంథాలయాలను ఆధునీకరించాలి. పుస్తకాల పఠనంపై ఆసక్తి తగ్గడంతో ఊరూరా గ్రంథాలయాలు నెలకొల్పాలన్న లక్ష్యం నీరుగారిపోతోంది. పోటీ పరీక్షలకు ఎల్లవేళలా పుస్తాకాలు అందుబాటులో ఉంచాలి. అయితే గ్రంథాలయాలను పటిష్టం చేసుకుంటూ, ఇంటర్‌నెట్‌ను కూడా అందుబాటులోకి చేసుకునే విదంగా

చూడాలని నిపుణులు సూచిస్తున్నారు. విదేశాల్లో గ్రంథాలయాలకు ప్రాధాన్యం ఇస్తారు. అన్నిరకాలుగా వాటిని తీర్చి దిద్దుతారు. పిల్లలకు కనీసం చదవడం, రాయడం వంటి విషయాలపై అవగాహన కల్పించాలని ఎస్.సి.ఇ.ఆర్.టి ఒక కార్యక్రమాన్ని చేపట్టింది. ఇటువంటి కార్యక్రమాలను దేశవ్యాప్తంగా నిర్వహించాలి. అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూడా చిన్న,చిన్న పుస్తక మహోత్సవాలను నిర్వహించి స్థానిక రచయితలను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా సాహిత్యాన్ని పరిపుష్టం చేయవచ్చు. అంతెందుకు స్కూళ్ల లో కూడా గ్రంథాలయాలు అతంతగానే ఉంటున్నారు. పాఠ్యపుస్తకాలు తప్ప ఇతర గ్రంథాలు అందుబాటులో ఉండడం లేదు. రెఫరెన్స్ పుస్తకాలు కూడా దొరకడం లేదు. డబ్బుండి కొనుక్కునే వారికి తప్ప పుస్తకాలు లేక లైబ్రరీలు నిరసించి పోతున్నాయి. అంతకుమించి నేటి విద్యార్థుల్లో పఠనాసక్తి తగ్గుతోంది. కేవలం పాఠ్య పుస్తకాలకే పరిమితం అవుతున్నారు. ప్రభుత్వ కళాశాలలు తగ్గడం, సామాజిక శాస్త్రాలు చదివిన వారికి తగిన ఉపాధి అవకాశాలు లేకపోవడం వల్ల ఆ శాస్త్రాలపై నేటి యువత మొగ్గుచూపటం లేదు.

# చంద్రబాబు కాన్వాయ్ వెంట మహిళ పరుగు

## కాన్వాయ్ ఆపి ఆమెతో ముచ్చటించిన బాబు

విజయవాడ:తనని చూసేందుకు కాన్వాయ్ వెంట పరుగులు పెట్టిన ఓహిళను చూసి కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబు.. కారు ఆపి ఆమెను పలకరించిన ఆసక్తికర ఘటన విజయవాడలో చోటు చేసుకుంది. ఎన్డీయే కూటమి శాసనసభాపక్ష సమావేశం మంగళవారం విజయవాడలోని ఏ కన్వెన్షన్ హాల్‌లో జరిగింది. సమావేశం అనంతరం ఉండవల్లికి ప్రయాణమైన చంద్రబాబును చూసేందుకు ఓ మహిళ కాన్వాయ్ వెంట పరుగులు పెట్టింది. ఆమెను కారులో నుంచి చూసిన చంద్రబాబు వెంటనే కాన్వాయ్ ఆపి దగ్గరకు పిలిచి మాట్లాడారు. తన పేరు నందిని అని.. తమరిని చూసేందుకు మదనపల్లి నుంచి వచ్చానని చెప్పింది. సెక్యూరిటీని వారించి చంద్రబాబు ఆమె వివరాలు తెలుసుకున్నారు. కష్టం ఫలించి.. మా కోరిక మేరకు సీఎం అయ్యారు సార్.. ఒక్కసారి మీ కాళ్లు మొక్కుతానని ఆ మహిళ అనగా.. చంద్రబాబు సున్నితంగా వారించారు. ఆమెను ఆప్యాయంగా పలకరించి ఫొటో దిగారు. తనకు జ్వరం ఉన్నా చూడటానికి వచ్చానని చెప్పగా.. ముందు ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు. ఆమె ఎక్కడ ఉంటారో తెలుసుకొని అవసరమైన వైద్యం అందించాలని పార్టీ నేతలకు చంద్రబాబు సూచించారు.

# చంద్రబాబు ప్రమాణస్వీకారాం చిరంజీవికి ప్రత్యేక ఆహ్వానం

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ నూతన ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో నటుడు చిరంజీవికి ప్రత్యేక ఆహ్వానం అందింది. ఈ కార్యక్రమానికి అగ్రకథానాయకుడు చిరంజీవి హాజరుకానున్నారు. ఆంధప్రదేశ్ రాష్ట్ర విశిష్ట అతిథిగా హాజరుకావాలని కోరుతూ చిరంజీవికి ప్రత్యేక ఆహ్వానం అందింది. ఈరోజు సాయంత్రం 5 గంటలకు ప్రత్యేక విమానంలో ఆయన విజయవాడ వెళ్లనున్నారు. అక్కడ నుంచి ఉదయం జరిగే ఈ కార్యక్రమానికి వెళ్లనున్నట్లు తెలుస్తుంది. రామ్ చరణ్ కూడా హాజరుకానున్నారు. మరోవైపు చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమ ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. బుధవారం ఉదయం 11.27 నిమిషాలకు సీఎంగా బాబు

ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ సహా పలువురు కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, సినీ, రాజకీయ ప్రముఖులు హాజరుకానున్నారు. తెదేపా, జనసేన, భాజపా కూటమి విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ జనసేనకు చిరంజీవి రూ.5 కోట్ల విరాళం ఇచ్చిన సంగతి తెలిసిందే. ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించిన తర్వాత కూటమి సభ్యులకు శుభాకాంక్షలు తెలుపుతూ పోస్టులు పెట్టారు. పవన్ కల్యాణ్ (ఖజీలిజీని ఐజీ÷ూజీని) కూడా ఎన్నికల ఫలితాల అనంతరం చిరంజీవి నివాసానికి వెళ్లి ఆశీర్వాదం తీసుకున్నారు.

# ఏపీ మంత్రివర్గంలో 17 మంది కొత్తవారే

అమరావతి: తెదేపా అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రిగా, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఉపముఖ్యమంత్రిగా బుధవారం ప్రమాణ స్వీకారం చేస్తారు. వారితో పాటే మరో 23 మంది మంత్రులూ ప్రమాణం చేయనున్నారు.

ఉపముఖ్యమంత్రిగా పవన్ కల్యాణ్ ఒక్కరే ఉంటారు. పవన్ సహా మొత్తం 24 మంది మంత్రుల జాబితాను మంగళవారం అర్ధరాత్రి దాటాక 1.15 గంటల సమయంలో ప్రకటించారు. ఒక స్థానాన్ని ఖాళీ ఉంచారు. జనసేనకు మూడు, భాజపాకు ఒక స్థానం కేటాయించారు. సీనియర్లకు, యువతకు మధ్య సమతూకం పాటిస్తూ మంత్రివర్గాన్ని రూపొందించారు. సగానికిపైగా కొత్తవారికి అవకాశం లభించింది. 17 మంది కొత్తవారికి అవకాశం కల్పించారు. ముగ్గురు మహిళలకు చోటు లభించింది. బీసీలు ఎనిమిది మంది, ఎస్సీలు ఇద్దరు, ఎస్టీ ఒకరు, ముస్లిం మైనారిటీల నుంచి ఒకరికి, వైశ్యుల నుంచి ఒకరికి అవకాశం దక్కింది. నలుగురు కాపులు, నలుగురు కమ్మ, ముగ్గురు రెడ్లకు అవకాశమిచ్చారు.



# గత ఐదేళ్లు విపత్కర పరిస్థితులు ఎదుర్కొన్నాం

**అమరావతి,:** గత ఐదేళ్లుగా ఆంధ్రప్రదేశ్ విపత్కర పరిస్థితులు ఎదుర్కొందని జనసేనాని పవన్ కళ్యాణ్ అన్నారు. ఎన్డీయే కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థిగా చంద్రబాబు పేరును పవన్ ప్రతిపాదించారు. కష్టాల్లో ఉన్న ఏపీని గాడిన పెట్టేందుకు చంద్రబాబు లాంటి అనుభవజ్ఞుడైన నాయకుడు అవసరం అని చెప్పారు. అనంతరం చంద్రబాబును పవన్ ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. విజయవాడ ఏ కన్వెన్షన్ హాలులో మంగళవారం ఎన్డీయే కూటమి ఎమ్మెల్యేలు భేటీ అయ్యారు. చంద్రబాబును ఎన్డీయే కూటమి శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ తీర్మానాన్ని గవర్నర్‌కు పంపనున్నారు. ఆయన ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానం పంపనున్నారు. అనంతరం బుధవారం ఉదయం 11:27 గంటలకు

ఏపీ సీఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేస్తారు. ఎన్నికల్లో కూటమి అద్భుత మెజార్టీతో 164 అసెంబ్లీ స్థానాలు, 21 లోక్ సభ స్థానాలను దక్కించుకుందని జనసేనాని పవన్ కల్యాణ్ అన్నారు. ఈ విజయం దేశం మొత్తానికి స్ఫూర్తినిచ్చిందని చెప్పారు. 'కూటమి ఎలా ఉండాలో అందరం కలిసికట్టుగా చూపించాం. కక్ష సాధింపులు, వ్యక్తిగత దూషణలకు సమయం కాదు. 5 కోట్ల మంది ప్రజలు మనందరిపై నమ్మకం పెట్టుకున్నారు. అభివృద్ధిని సమష్టిగా ముందుకు తీసుకెళ్లాలని పవన్ పిలుపునిచ్చారు. ఎన్నికల్లో తెదేపా, జనసేన, భాజపా కూటమి కలిసి కట్టుగా పోరాడి అద్భుత విజయాన్ని సొంతం చేసుకుందని చెప్పారు. కూటమి శాసన సభాపక్ష నేతగా చంద్రబాబు పేరును ప్రతిపాదించిన అనంతరం పవన్ మాట్లాడారు. 'తెదేపా, జనసేన, భాజపా ఎమ్మెల్యేలకు శు భాకాంక్షలు. అందరం కలిసికట్టుగా పోరాడి అద్భుతమైన మెజారిటీలతో గెలిచాం. 164 శాసనసభ స్థానాలు, 21 ఎంపీలను ఎన్డీయే కూటమి దక్కించుకుంది. అద్భుతమైన విజయం ఇది. కూటమి అంటే ఎలా ఉండాలో రాష్ట్ర ప్రజలు కలిసికట్టుగా చూపించారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలనివ్వం అని ఇప్పటం సభలో చెప్పాం..అదే మాటపై నిలబడ్డాం. ఒడుదొడుకులు ఎదుర్కొన్నాం.. తగ్గాం.. ప్రజల్లో నమ్మకాన్ని పెంచి అద్భుతమైన మెజారిటీతో ప్రభుత్వాన్ని స్థాపించ బోతున్నాం. కక్ష సాధింపులకు, వ్యక్తిగత దూషణలకు ఇది సమయం కాదు.

మనందరం సమష్టిగా ప్రభుత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలి. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలి. సాగునీరు, తాగునీరు, విద్య, వైద్యం, శాంతి భద్రతల విషయంలో బలంగా నిలబడతామని చెప్పాం. ఉమ్మడి మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను బాధ్యతగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది. ఇలాంటి సమయంలో సుదీర్ఘ

అనుభవం ఉన్న

నాయకుడు కావాలి. నాలుగు దశాబ్దాల అనుభవం, అభివృద్ధిపై అపారమైన అవగాహన, పెట్టుబడులను తీసుకొచ్చే సమర్థత, ప్రతిభ, విదేశాల అధ్యక్షులను తెలుగు రాష్ట్రాల వైపు దృష్టి

మళ్లించే శక్తి ఉన్న చంద్రబాబు నాయకత్వం రాష్ట్రానికి చాలా అవసరం. ఆయన నలిగిపోయారు. జైల్లో చూశాను. అప్పుడు చంద్రబాబు సతీమణి భువనేశ్వరి పడిన బాధను చూశాను. మంచిరోజులు వస్తాయి.. కన్నీళ్లు పెట్టొద్దని చెప్పాను.



వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...
TELUGU DAILY NEWS
3
బుధవారం 12 జూన్ 2024

## మోదీ కా పరివార్'ను తొలగించాలి సోషల్ మీడియా హ్యాండిల్స్ పై మోడీ ట్వీట్

**న్యూఢిల్లీ:** సోషల్ మీడియా హ్యాండిల్స్ నుంచి 'మోదీ కా పరివార్'ను తొలగించాలని దేశ ప్రజలందరికీ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మంగళవారంనాడు విజ్ఞప్తి చేశారు. బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే విజయం సాధించడం ద్వారా సమర్థవంతంగా సందేశం వెళ్లిందని అన్నారు. ప్రధానమంత్రికి సొంత కుటంబం లేదంటూ ఆర్జేడీ సుప్రీం లాలూ ప్రసాద్ యాదవ్ గత మార్చిలో సంచలన వ్యాఖ్యలు చేశారు. దీంతో సామాజిక మాధ్యమాల్లో మోదీకి సంఘీభావం వెల్లువెత్తింది. బీజేపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు తమ పేర్లకు ముందు 'మోదీ కుటుంబం' అని రాసుకున్నారు. ఎన్నికలు పూర్తికావడం, మూడోసారి బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే సర్కార్ పదవీ బాధ్యతలు చెప్పడటంతో సోషల్ మీడీయా వేదికల నుంచి 'మోదీ కా పరివార్'ను తొలగించాలని మోదీ విజ్ఞప్తి చేశారు. 'నామీద అభిమానంలో లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో దేశవ్యాప్తంగా ప్రజలు తమ సోషల్ మీడియా ఖాతాలలో 'మోదీ కా పరివార్' అని రాశారు. ఇది నాకెంతో బలాన్ని ఇచ్చింది. ప్రజలు మూడోసారి ఎన్డీయేకు మెజారిటీ ఇచ్చారు. ఇదొక రికార్డు. దేశ అభివృద్ధిని కొనసాగించాలనే బలమైన సందేశం మాకు అందింది' అని మోదీ తన 'ఎక్స్' ఖాతాలో తెలిపారు. మనదంతా ఒకే కుటుంబం అంటూ ప్రజలిచ్చిన సందేశం అందరికీ చేరిందని, అదే కృతజ్ఞతతో మీ సోషల్ మీడియా ఖాతాల నుంచి దానిని ఇప్పుడు తొలగించాలని కోరుతున్నానని చెప్పారు. డిస్‌ప్లేలో పేరు మారినా భారతదేశ ప్రగతి కోసం ప్రయత్నిస్తున్న కుటుంబంగా మన బంధం విడదీయరానిదని మోదీ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

# సెలవులకు టాటా.. ఇక బడిబాట!



హైదరాబాద్: రాష్ట్రంలో వేసవి సెలవుల అనంతరం ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలు బుధవారం తెరచుకోనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 60 లక్షల మంది విద్యార్థులు 48 రోజుల అనంతరం బడిబాట పట్టనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో అవసరమైన మరమ్మతు పనులను దాదాపు పూర్తిచేశారు. తరగతి గదులను అలంకరించి, ప్రవేశ ద్వారాలకు మామిడి తోరణాలు కట్టి పండగ వాతావరణంలో విద్యార్థులకు స్వాగతం పలికేందుకు సన్నాహాలు చేస్తున్నారు. తొలిరోజే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాంల పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. వాటిని మంత్రులు, ఎమ్మెల్యేల ద్వారా అందించనున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం కొన్ని ప్రభుత్వ పాఠశాలలను సందర్శిస్తారని తొలుత సమాచారం అందినప్పటికీ..అనివార్య కారణాల వల్ల వాయిదాపడిందని విద్యాశాఖ వర్గాల సమాచారం. ఈ నెల 6వ తేదీన ప్రారంభమైన 'బడిబాట' కార్యక్రమం 19వ తేదీ వరకు కొనసాగనున్న నేపథ్యంలో త్వరలోనే ముఖ్యమంత్రి ఆ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులతో ముచ్చటిస్తారని ఆ వర్గాలు తెలిపాయి.

స్వచ్ఛ కార్మికులను నియమిస్తేనే...

పాఠశాల విద్యాశాఖ పరిధిలోని బడుల్లో శౌచాలయాలను శుభ్రం చేయడానికి, ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచేందుకు స్వచ్ఛ కార్మికుల(శానిటరీ వర్కర్లు)ను నియమిస్తామని కొద్ది నెలల క్రితమే సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. దీనిపై ఇప్పటివరకు అధికారిక ఉత్తర్వులు వెలువడలేదు. మరోవైపు ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో కనీసం ఒక ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో పేర్కొంది. దానిపై కసరత్తు చేసిన అధికారులు కొత్తగా 203 చోట్ల బడులు అవసరమని విద్యాశాఖకు ప్రతిపాదించారు. వాటిని ప్రారంభించేందుకు ఇప్పటివరకు ఆదేశాలు రాలేదు. అయితే త్వరలోనే సీఎం హామీ అమలవుతుందని, సంబంధిత ఉత్తర్వులు వెలువడుతాయని విద్యాశాఖ వర్గాలు



## హైదరాబాద్‌లో దంచికొట్టిన వాన పలు ప్రాంతాలు జలమయం

**హైదరాబాద్:** హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. గ్రేటర్ హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో జోరువాన పడింది.. చందానగర్, మియాపూర్, గచ్చిబౌలి ప్రాంతాల్లో వాన పడుతోంది. కుకట్‌పల్లి, కేపీహెచ్‌పీ, మియాపూర్, ఎల్‌బీ నగర్,ఉప్పల్, కాప్రా, మేడ్చల్‌లో కూడా కుండపోత వాన కురుస్తోంది. భారీ వర్షంతో నగరంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఇక పలు చోట్ల హైదరాబాద్ రోడ్లు చెరువులను తలపించాయి. వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. నగరంలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం పడడంతో సికింద్రాబాద్, అల్వాల్, కంటోన్మెంట్, బేగంపేట్, పంజాగుట్ట, అమీర్ పేట్, కూకట్ పల్లి, మాదాపూర్, ఖైరతాబాద్, నాంపల్లి, బషీర్ బాగ్, అబిడ్స్ , నారాయణగూడ, కాంచన్ బాగ్, అలియబాద్, సంతోష్ నగర్, బండ్లగూడ, చాంద్రాయణగుట్ట, ఛత్రినాక, శాలిబండ, ఫలక్ నుమా, కుత్బుల్లాపూర్, జీడిమెట్ల, కొంపల్లితోపాటు పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో భారీ వర్షానికి రోడ్లపై వరద నీళు ప్రవహిస్తుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మల్లికార్జున్ నగర్ మల్లికార్జున నగర్, అశోక్ నగర్ ప్రాంతాలలో వర్షానికి కాలనీ రోడ్లు జలమయ మయ్యాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇంకా భారీ వర్షం కురిస్తే పరిస్థితి ఎలా ఉంటుందో అని కాలనీ వాసులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉప్పల్ ప్రాంతంలో వర్షం కురిసి తగ్గడంతో ఒకేసారి రోడ్లపైకి వచ్చిన వాహనాలతో వరంగల్ టూ మేడిపల్లి, ఉప్పల్ రోడ్డుపై భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది.

# ప్రియాంక పోటీ చేసివుంటే మోడీ ఓడిపోయేవారు



**లక్నో :**ఈ ఎన్నికల్లో వారణాసి నుంచి ప్రియాంకగాంధీ పోటీ చేసి ఉంటే.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఓడిపోయేవారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. కనీసం రెండు, మూడు లక్షల ఓట్ల తేడాతో తన సోదరి చేతిలో పరాజయం పాలయ్యేవారని చెప్పారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని రాయ్‌బరేలీలో నిర్వహించిన ప్రత్యేక సభలో పాల్గొన్న రాహుల్, ప్రియాంక గాంధీలు.. లోక్‌సభ ఎన్నికల్లో గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంటులో భాజపా నేతృత్వంలోని ఎన్డీయే కూటమి బలాన్ని తగ్గించేందుకు రాయ్‌బరేలీ, అమేఠీలతోపాటు దేశంలోని ఇతర ప్రాంతాల్లో 'ఇండియా' కూటమి పార్టీలన్నీ ఐకమత్యంతో పోరాడాయి' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఎన్నికల్లో మెరుగైన ఫలితాల విషయంలో అహం ప్రదర్శించబోమని, ప్రజాప్రయోజనాల కోసం కృషి చేస్తామని తెలిపారు. అయోధ్య రామమందిర ప్రతిష్ఠాపన కార్యక్రమంలో సామాన్యులను విస్మరించి.. పారిశ్రామిక వేత్తలు, ఇతర ప్రముఖులకే మోదీ ప్రాధాన్యం ఇచ్చారని.. అందుకే అక్కడ భాజపాకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని వ్యాఖ్యానించారు. అమేఠీ, రాయ్‌బరేలీల్లో హస్తం పార్టీకి ప్రజలు చరిత్రాత్మక విజయాన్ని కట్టబెట్టారని ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. ఈ రోజు దేశమంతా అవధ్ (అయోధ్య) వైపు చూస్తోందని.. స్వచ్ఛమైన, అంకితభావంతో కూడిన రాజకీయాలు అవసరమనే సందేశాన్ని ఈ ప్రాంతం చాటిచెప్పినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో రోజూ రెండు, మూడు గంటలు మాత్రమే నిద్రకు కేటాయించి, మిగతా సమయంలో పార్టీ కార్యక్రమాల్లో నిమగ్నమయ్యానని చెప్పారు. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ శ్రేణుల సమన్వయంతోనే యూపీలో భారీ విజయాలను నమోదు చేసినట్లు చెప్పారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ కంచుకోటలైన రాయ్‌బరేలీ నుంచి రాహుల్‌గాంధీ, అమేఠీ నుంచి కిశోరీలాల్ శర్మ గెలుపొందిన విషయం తెలిసిందే. అయోధ్య క్షేత్రం ఉన్న ఫైజాబాద్‌లో కమలం అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ లల్లూ సింగ్‌పై ఎస్పీ దళిత నేత అవధేశ్ ప్రసాద్ విజయం సాధించారు. మరోవైపు.. యూపీలోని మొత్తం 80 స్థానాల్లో ఎస్పీ 37, కాంగ్రెస్ 6 సీట్లు సాధించాయి. భాజపా 33 స్థానాలకే పరిమితమైంది.

## ఒడిశా కొత్త ముఖ్యమంత్రిగా మోహన్ మాఝీ

భువనేశ్వర్: ఒడిశాలో తొలిసారి భాజపా ప్రభుత్వ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. రాష్ట్ర ముఖ్యమంత్రిగా మోహన్ చరణ్ మాఝీని పేరును కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రకటించారు అలాగే, కనక్ వర్ధన్ సింగ్ డియో, ప్రవటి పరిదాలకు ఉప ముఖ్యమంత్రులుగా పదవులు దక్కాయి. భువనేశ్వర్‌లో జరిగిన భాజపాఎల్పీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ భేటీకి భాజపా అధిష్ఠానం తరఫున పరిశీలకులుగా కేంద్రమంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, భూపేందర్ యాదవ్ హాజరయ్యారు.రాష్ట్రంలో కమలదళ సీనియర్ నేతల్లో ఒకరైన మాఝీ.. ఇప్పటివరకు నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో కియోంజర్ స్థానం నుంచి ఆయన విజయం సాధించారు. రెండున్నర దశాబ్దాల తర్వాత రాష్ట్రంలో కొత్త ముఖ్యమంత్రిగా మోహన్ మాఝీ బాధ్యతలు చేపట్టనున్నారు. 1997–2000 వరకు సర్పంచ్‌గా పనిచేసిన ఆయన.. 2000లో తొలిసారి అసెంబ్లీలో అడుగుపెట్టారు. 2009, 2019తోపాటు తాజా అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించారు. బలమైన గిరిజన నేతల్లో ఒకరిగా ఎదిగారు. జూన్ 12న సీఎం ప్రమాణస్వీకారం చేయనున్నట్లు సమాచారం. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరు కానున్నట్లు తెలుస్తోంది.

# సంస్థాగత మార్పులపై బిజెపి దృష్టి

### నడ్డా స్థానంలో కొత్త అధ్యక్షుడి ఎంపికపై కసరత్తు

### రాష్ట్రాల్లోనూ బిజెపికి కొత్త అధ్యక్షులపై దృష్టి



**న్యూఢిల్లీ:** కేంద్రంలో మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన భాజపా .. తాజాగా పార్టీ సంస్థాగత మార్పులకు సిద్ధమైంది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా త్వరలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించనుంది. దీంతోపాటు పార్టీ జాతీయాధ్యక్షుడి ఎంపిక, రాష్ట్రాల్లో సంస్థాగత ఎన్నికలు, పార్టీ అధ్యక్షుల మార్పు వంటి అంశాలపై కాషాయ పార్టీ దృష్టి సారించినట్లు సమాచారం.భాజపా జాతీయాధ్యక్షుడిగా ఉన్న జేపీ నడ్డా.. తాజాగా కేంద్ర మంత్రివర్గంలో చేరారు. పార్టీ అధ్యక్షుడిగా ఆయన పదవీకాలాన్ని ఇటీవల ఆరు నెలలు పొడిగించగా.. అది కూడా జూన్ 30తో ముగియనుంది. దీంతో పార్టీకి కొత్త అధ్యక్షుడి ఎంపిక అనివార్యమైనట్లు తెలుస్తోంది. ఈ ప్రక్రియ పూర్తయ్యేవరకు నడ్డా పదవీ కాలాన్ని భాజపా పార్లమెంటరీ బోర్డు పొడిగించే అవకాశం ఉన్నప్పటికీ దీనిపై అధిష్ఠానం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అయితే కొత్త అధ్యక్షుడి ఎంపికకే మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో భాజపా అధ్యక్షుడిగా ఉన్న అమిత్ షా.. కేంద్రం హోంశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అప్పుడు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన నడ్డా.. జనవరి 2020లో పూర్తిస్థాయి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించారు. పార్టీని పటిష్ఠ పరిచేందుకు శాయశక్తులా కృషి చేసే సీనియర్ నేతకు పార్టీ పగ్గాలు అప్పజెప్పాలనేది ప్రధాని మోదీ నిర్ణయమని.. అందుకే జేపీ నడ్డాను అప్పట్లో ప్రభుత్వంలోకి తీసుకోలేదన్న సంకేతాన్ని పంపించారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పార్టీ అధ్యక్షుడిగా ధర్మేంద్ర ప్రధాన్, భూపేంద్ర యాదవ్ వంటి సీనియర్ల నేతల పేర్లు వినిపించినప్పటికీ ప్రస్తుతం వాళ్లు కేంద్ర మంత్రివర్గంలో కొనసాగుతుండడంతో వారికి ఆ అవకాశం రానట్లేనని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రాల నుంచి కొత్త వ్యక్తిని ఎంపిక చేయడం లేదా జాతీయ కార్యదర్శుల్లో ఒకరికి అధ్యక్ష పగ్గాలు అప్పగించవచ్చనే వాదన వినిపిస్తోంది. వీటితోపాటు పలు రాష్ట్రాల్లో పార్టీ అధ్యక్షులను మార్చే యోచనలో భాజపా ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఉత్తర్ ప్రదేశ్‌లో లోక్‌సభ ఎన్నికల్లో భారీగా నష్టపోయిన పార్టీ.. అధ్యక్షుడిగా కొత్త ముఖాన్ని పరిచయం చేయనున్నట్లు సమాచారం. పశ్చిమ బెంగాల్‌లో పార్టీ అధ్యక్షుడిగా ఉన్న సుకాంత మజుందార్ కేంద్ర మంత్రి కావడం, బిహార్ పార్టీ అధ్యక్షుడు

ఉప ముఖ్యమంత్రిగా కొనసాగుతుండటం, హరియాణా ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ చేతుల్లోనే పార్టీ పగ్గాలు ఉండటంతో ఆయా రాష్ట్రాల అధ్యక్షుల మార్పు అనివార్యంగా కనిపిస్తోంది. సామాజిక సమీకరణాల నేపథ్యంలో రాజస్థాన్‌లో భాజపా అధ్యక్షుడిని మార్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## రామోజీ మరణం తీరని లోటు

### కుటుంబ సభ్యులకు సిఎం రేవంత్ పరామర్శ



**హైదరాబాద్:** రామోజీ గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు కుటుంబ సభ్యులను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరామర్శించారు. గుండె సంబంధిత సమస్యలతో హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చేరిన రామోజీరావు చికిత్స పొందుతూ శనివారం తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే. ఆరోజు సీఎం రేవంత్‌రెడ్డి దిల్లీ పర్యటనలో ఉండటంతో రామోజీరావు పార్థివదేహానికి నివాళులర్పించ లేకపోయారు. రాష్ట్ర ప్రభుత్వ లాంఛనాలతో రామోజీరావు అంత్యక్రియలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఫిల్మ్‌సిటీలోని ఆయన నివాసానికి వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. రామోజీరావు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. రామోజీరావుతో తనకున్న అనుబంధాన్ని 'ఈనాడు' ఎండీ కిరణ్, మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్, రామోజీ ఫిల్మ్‌సిటీ ఎండీ విజయేశ్వరితో పంచుకున్నారు. రామోజీరావు వ్యక్తి కాదు వ్యవస్థ.. ఆయనకు ప్రత్యామ్నాయం లేదన్నారు. రామోజీ చూపిన మార్గంలో వారి కుటుంబ సభ్యులు, సంస్థలు ప్రజల తరఫున నిలబడాలని ఆకాక్షించారు. ఆయన ఆలోచనా విధానాలకు అనుగుణంగా ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తుందని రేవంత్‌రెడ్డి చెప్పారు. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, మల్‌రెడ్డి రంగారెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు సీఎం వెంట ఉన్నారు. అలాగే దివంగత రామోజీరావుకు త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి నివాళులర్పించారు. రామోజీ ఫిల్మ్‌సిటీలోని ఆయననివాసానికి వచ్చిన ఇంద్రసేనారెడ్డి.. రామోజీరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. తెలుగు ప్రజలు అభిమానించే రామోజీరావు.. అందరికీ ఆర్మప్రాయుడని తెలిపారు. ఆయన మరణం తెలుగు ప్రజలకు తీరని లోటని అన్నారు. రామోజీరావుతో తనకు ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

# మద్యం ప్రియులకు శుభవార్త బ్రాండెడ్ మద్యం దిగుమతి

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లోని మద్యం ప్రియులకు శుభవార్తే. గత ఐదేళ్లుగా బ్రాండెడ్ మద్యం కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురుచూసిన వారి ఆశలు ఫలించాయి. ప్రభుత్వం మారడంతో బ్రాండెడ్ మద్యం మళ్లీ దిగుమతి అవుతోంది. కొత్త స్టాక్‌తో మద్యం దుకాణాలు కళకళలాడుతున్నాయి. తాజాగా కింగ్‌ఫిషర్ బీర్లు గొడౌన్లకు చేరుకున్నాయి. గోదాములలోకి లారీల నుంచి బీర్లను అన్‌లోడ్ చేస్తున్న వీడియోను టీడీపీ అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. ఏపీ నుంచి మాయమైపోయిన బీర్లు మళ్లీ వచ్చాయని ఆయన దానికి క్యాప్షన్ జోడించారు. ఈ వీడియోపై నెటిజన్లు సంతోషం వ్యక్తంచేస్తూ కామెంట్లు పెడుతున్నారు. కింగ్‌ఫిషర్ ఒక్కటే కాదని, పలానా బ్రాండ్లు కావాలంటూ వాటి లిస్ట్ కూడా పెడుతున్నారు. దీనికి స్పందించిన ఆనం.. త్వరలోనే అన్ని మద్యం బ్రాండ్లు దొరుకుతాయని పేర్కొన్నారు. మరోవైపు, ఇష్టమైన మద్యం మళ్లీ అందుబాటులోకి వస్తుండడంతో నెటిజన్లు మీమ్స్‌తో సెలబ్రేట్ చేసుకుంటున్నారు.




# 14న కన్నప్ప టీజర్ విడుదల క్యూరియాసిటీ పెంచుతున్న టీమ్

టాలీవుడ్ యాక్టర్ మంచు విష్ణు అండ్ మోహన్ బాబు కాంపౌండ్ నుంచి వస్తోన్న చిత్రం కన్నప్ప. తొలి పాన్ ఇండియా సినిమాగా మంచు విష్ణు టైటిల్ రోల్ పోషిస్తున్న ఈ చిత్రానికి బాలీవుడ్ దర్శకుడు ముఖేశ్ కుమార్ సింగ్ డైరెక్ట్ చేస్తున్నాడు. పాన్ ఇండియా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రంలో గ్లోబల్ స్టార్ ప్రభాస్, కలెక్షన్ కింగ్ మోహన్‌బాబు, మోహన్ లాల్, నయనతార, మధుబాల, శరత్‌కుమార్, శివరాజ్‌కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. టీజర్ లాంఛింగ్ అప్‌డేట్‌ను కౌంట్‌డౌన్ పోస్టర్‌తో మరోసారి షేర్ చేసుకున్నారు. మరో మూడు రోజుల్లో జూన్ 14న కన్నప్ప టీజర్ గ్రాండ్‌గా లాంఛ్ కానున్నట్టు తెలియజేశారు మేకర్స్. శివుడి ఆరాధ్య భక్తుడు కన్నప్ప ఇతిహాస ప్రయాణాన్ని చూపించబోతున్నాం. అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను పొందేందుకు రెడీగా ఉండండి. అంటూ మేకర్స్ అందించిన అప్‌డేట్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌లో భాగంగా కన్నప్ప టీం కన్నప్ప టీజర్ స్పెషల్ స్క్రీనింగ్ నిర్వహించారని తెలిసిందే. మంచు విష్ణు చేతిలో ఖడ్గం పట్టుకొని సమరంలో ఉన్న కన్నప్ప పోస్టర్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతూ సూపర్ బజ్ క్రియేట్ చేస్తోంది. క్లాస్, మాస్, యాక్షన్ హీరోగా పాపులారిటీ దక్కించుకున్న బాలీవుడ్ యాక్టర్ అక్షయ్‌కుమార్ కన్నప్పలో కీ రోల్ పోషిస్తుండటంతో అంచనాలు అమాంతం పెరిగిపోతున్నాయి. ఈ చిత్రానికి మెలోడీ బ్రహ్మ మణిశర్మ, స్టీఫెన్ దేవసి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ సమకూరుస్తున్నారు. 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, బ్యానర్లపై భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి పరుచూరి గోపాలకృష్ణ, బుర్రా సాయిమాధవ్, తోట ప్రసాద్ స్క్రీన్‌ప్లే అందిస్తున్నారు.



# వైభవంగా అర్జున్ కూతరు వివాహం

యాక్షన్ కింగ్ అర్జున్ కుమార్తె ఐశ్వర్య వివాహం సోమవారం సోమవారం చెన్నైలోని అంజనాసుత శ్రీ యోగంజనేయస్వామి మందిరంలో వైభవంగా జరిగింది. కోలీవుడ్ స్టార్ కమెడియన్ తంబి రామయ్య కుమారుడు, నటుడు ఉమాపతితో ఇటీవల ఐశ్వర్య అర్జున్ నిశ్చితార్థం గ్రాండ్‌గా జరిగిన విషయం తెలిసిందే. ఇప్పుడు వారి పెళ్లిని కూడా ఇరు కుటుంబ సభ్యులు గ్రాండ్‌గా నిర్వహించారు. ఐశ్వర్య అర్జున్, ఉమాపతిల పెళ్లికి సంబంధించి.. జూన్ 7న హల్ది కార్యక్రమంతో ఈ పెళ్లి వేడుక మొదలైంది. జూన్ 8 సంగీత్ కార్యక్రమం జరుపుకుని, జూన్ 10న ఉదయం సినీ ప్రముఖుల సమక్షంలో వైభవంగా వివాహమహోత్సవం జరిగింది. కాగా, ఐశ్వర్య అర్జున్, ఉమాపతిల వెడ్డింగ్ రిసెప్షన్ జూన్ 14న చెన్నై లీలా ప్యాలెస్‌లో గ్రాండ్‌గా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



# అందాల ఆరబోస్తున్న సురేఖ వాణి కూతురు సుప్రిత



క్యారక్టర్ నటి సురేఖా వాణి కుమార్తె బందారు సుప్రిత సామాజిక మాధ్యమంలో చాలా చురుకుగా ఉంటోంది. బాలీవుడ్ హీరోయిన్లను అనుసరిస్తూ ఫోటోలకు పోజులిచ్చేస్తోంది. తన అందాలను ఆరబోస్తోంది. సుప్రిత సినిమాలు ఏమీ ఇంకా విడుదల కాలేదు కానీ ఆమె పేరు మాత్రం బాగా పాపులర్ అవుతోంది. సామజిక మాధ్యమాల్లో ఆమె పోస్టు చేసే ఫోటోలకి నెటిజన్స్ అప్పుడప్పుడూ ఫిదా అవుతూ వుంటారు, అలాగే వాటిపై కామెంట్స్ కూడా చేస్తూ వుంటారు. ఈమధ్య అద్దం ముందు నిలుచొని కొన్ని ఫోటోలు తీసుకున్న సుప్రిత అవి తన ఇన్స్టాగ్రామ్ లో పోస్ట్ చేసింది. వాటిపై నెటిజన్స్ కామెంట్స్ చేస్తూ నువ్వు అచ్చం జాన్వీ కపూర్ లా వున్నావు అని చెప్పారు ఒకరు. హిందీ నటి జాన్వీ కపూర్ కూడా తన చాలా ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తూ అభిమానులతో ఎప్పుడూ టచ్ లో ఉంటూ ఉంటుంది. అయితే ఆమె హిందీ నటి, శ్రీదేవి కుమార్తె, ఇప్పుడు తెలుగులో ఎన్టీఆర్ పక్కన 'దేవర' సినిమాలో కథానాయకురాలిగా చేస్తోంది, అలాగే రామ్ చరణ్ పక్కన దర్శకుడు బుచ్చిబాబు సినిమాలో కూడా చేస్తోంది. అలంటి జాన్వీ కపూర్ ని సురేఖా వాణి కుమార్తె సుప్రిత ఫాలో అవుతోంది అన్నట్టుగా కనిపిస్తోంది. ఎందుకంటే జాన్వీ కపూర్ ఎలా అయితే మంచి గ్లామర్ ఫోటోలు పోస్టు చేస్తూ ఉంటుందో సురేఖ వాణి కుమార్తె కూడా అటువంటి ఫోటోలనే పోస్టు చేస్తూ ఉంటుంది. సుప్రిత ఇప్పుడు ఒక సినిమాలో కథానాయకురాలిగా కూడా అరంగేట్రం చేస్తోంది. అయితే ఆ సినిమా ఇంకా చిత్రీకరణ దశలోనే వుంది. సినిమా విడుదలవకముందే తన కేవలం ఫోటోల తోటే సుప్రిత ఇన్స్టాగ్రామ్ లో బాగా పాపులర్ అయిపోయింది అని అంటున్నారు. ఇప్పుడు సుప్రిత ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

# నా కెరీర్‌లో బెస్ట్ మూవీ

భారతీయుడు-2లో రోల్‌పై రకుల్

కమల్ హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'భారతీయుడు 2'. వీళ్లిద్దరి కాంబినేషన్‌లోనే వచ్చిన హిట్ సినిమా 'భారతీయుడు'కు సీక్వెల్‌గా ఇది రానుంది. ఇందులో రకుల్ ప్రీత్ సింగ్ కీలకపాత్రలో నటిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తన పాత్ర గురించి తెలిపారు. 'నా కెరీర్‌లోనే 'ఇండియన్-2' బెస్ట్ సినిమా అవుతుంది. ఇందులో నా పాత్ర అంత గొప్పగా ఉంటుంది. నా నిజ జీవితానికి దగ్గర పోలిక ఉంది. ఎంతో ఆత్మవిశ్వాసం ఉన్న మహిళగా కనిపిస్తాను. ఇప్పటి వరకు ఇలాంటి పాత్రలో నటించలేదు. ఈ సినిమా షూటింగ్ మొత్తం గొప్ప అనుభూతినిచ్చింది. శంకర్ వంటి అగ్ర దర్శకులతో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నాను. ఈ సినిమా విశేషాలను మీతో పంచుకోవాలని చాలా ఆసక్తిగా ఉంది. దానికి ఇంకా సమయం పడుతుంది' అని తెలిపారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా జులై 12న విడుదల కానుంది. 1996లో శంకర్ దర్శకత్వంలో వచ్చి సంచలనం సృష్టించింది 'భారతీయుడు'. సేనాపతి పాత్రలో కమల్ ఆహార్యం, నటన ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'భారతీయుడు 2' మరోసారి మ్యాజిక్ చేసేందుకు సిద్ధమైంది. ఇది విడుదలైన వెంటనే మూడో భాగానికి సంబంధించిన నిర్మాణాంతర పనుల్ని మొదలు పెట్టనున్నారు. యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో కమల్ హాసన్‌తో పాటు సిద్దార్థ్, కాజల్ అగర్వాల్, ప్రియా భవానీ శంకర్, ఎస్‌జే సూర్య తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇందులో మనీషా కొయిరాల కూడా కనిపించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. శంకర్‌తో ఆమె దిగిన ఫొటో వైరల్ కావడంతో మనీషా కూడా అతిథిపాత్రలో నటించారని టాక్ వినిపిస్తోంది.



# సోనాక్షి వివాహం అంటూ ప్రచారం

తనకింకా విషయం తెలీదన్న శత్రుఘ్నసిన్హా

ప్రముఖ బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా కొద్ది రోజుల్లో పెళ్లి పీటలు ఎక్కబోతున్నారంటూ సోషల్ మీడియా కోడై కూస్తోంది. నటుడు జహీర్ ఇక్బాల్‌తో సోనాక్షి వివాహం జరగనుందంటూ వార్తలు వచ్చాయి. తన కూతురి వివాహంపై వచ్చిన రూమర్స్‌పై నటుడు శత్రుఘ్నసిన్హా స్పందించారు. వారిద్దరి ప్రేమాయణం గురించి ఇప్పటివరకు తనకు ఎలాంటి సమాచారం అందలేదన్నారు. సోనాక్షి వివాహం చేసుకోనుందని ప్రచారం జరుగుతోంది. కానీ, దాని గురించి నా దగ్గర ఎలాంటి సమాచారం లేదు. ఈ విషయం మీడియాకు కూడా తెలుసని.. మీ కూతురి వివాహం గురించి మీకు తెలియదా అని చాలామంది నన్ను అడిగారు. నిజంగా నాకు ఈ విషయం గురించి తెలియదు. ఎందుకంటే సోనాక్షి ఇప్పటివరకు నాకేమీ చెప్పలేదు. ఒకవేళ నా కూతురి వివాహం జరిగితే.. బారాత్ ముందు డాన్స్ చేయడానికి రెడీగా ఉన్నా అని శత్రుఘ్నసిన్హా ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఈ రోజుల్లో పిల్లలు తల్లిదండ్రుల అనుమతి కోరడం లేదు. కేవలం సమాచారం ఇస్తున్నారు అంతే. ఇందుకోసం వేచిచూస్తున్నాం. సోనాక్షి నిర్ణయంపై నాకు పూర్తి విశ్వాసం ఉంది. అదే నిజమైతే..ఆ జంటను ఆశీర్వదించడానికి సిద్ధంగా ఉన్నా అని అన్నారు. కాగా.. సోనాక్షి, జహీర్ కొన్నేళ్ల నుంచి డేటింగ్‌లో ఉంటున్నారని వదంతులు వచ్చాయి. జూన్ 23న వీరిద్దరూ వివాహబంధంలోకి అడుగుపెట్టబోతున్నారంటూ జోరుగా ప్రచారం జరుగుతోంది. ముంబయిలో జరగబోయే ఈ వివాహానికి ఇప్పటికే కుటుంబసభ్యులు, హీరామండి బృందం సహా పలువురికి ఆహ్వానం అందినట్లు సమాచారం. ఈనేపథ్యంలోనే శత్రుఘ్న సిన్హా తాజాగా స్పందించారు.

# కల్కి ట్రైలర్‌కు భారీగా ఆదరణ



ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సైన్స్ ఫిక్షన్ యాక్షన్ ఫిల్మ్ 'కల్కి 2898 ఏడీ' జూన్ 27న విడుదల కానుంది. తాజాగా దీని ట్రైలర్‌ను విడుదల చేశారు. ప్రేక్షకుల అంచనాలను రెట్టింపు చేసే ఎలివేషన్స్‌తో పవర్‌ఫుల్‌గా ఉందీ ట్రైలర్. ప్రభాస్ సరసన దీపికా పదుకొణె నటిస్తుండగా.. దిశా పటానీ, అమితాబ్ బచ్చన్ , కమల్ హాసన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రభాస్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సినిమా ఏదైనా ఉందా అంటే ఠక్కునే చెప్పే పేరు కల్కి 2898 ఏడీ సైన్స్ ఫిక్షన్ జోనర్‌లో మహానటి ఫేం నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్నాడు. వైజయంతీ మూవీస్ తెరకెక్కిస్తోన్న ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా జూన్ 27న తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. విడుదల తేదీ దగ్గరపడుతున్న కొద్దీ ఏదో ఒక అప్‌డేట్‌తో అభిమానుల్లో జోష్ నింపుతున్నారు మేకర్స్. ఇప్పటకే రిలీజ్ చేసిన బుజ్జి, భైరవ విజువల్స్, ట్రైలర్ సినిమాపై సూపర్ బజ్ క్రియేట్ చేస్తున్నాయి. తాజాగా ఐమాక్స్ వెర్షన్‌లో కూడా సందడి చేసేందుకు రెడీ అవుతోంది. ఈ సందర్భంగా ఐమాక్స్ వెర్షన్ పోస్టర్‌ను షేర్ చేశారు మేకర్స్. అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ అందించేలా ఐమాక్స్ వెర్షన్ ఉండబోతుందని తాజా పోస్టర్‌తో అర్థమవుతోంది.ఈ చిత్రంలో ప్రభాస్ భైరవ పాత్రలో కనిపించనుండగా.. అతడి దోస్త్ బుజ్జిగా స్పెషల్ కారు సందడి చేయనుంది. ఈ మూవీలో బాలీవుడ్ భామలు దీపికా పదుకొనే, దిశా పటానీ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. లెజెండరీ యాక్టర్లు అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, రాజేంద్రప్రసాద్, పశుపతి ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం నుంచి ఇప్పటికే లాంఛ్ చేసిన కల్కి 2898 ఏడీ టైటిల్, గ్లింప్స్ వీడియో, టీజర్ మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతోంది. ఈ చిత్రంలో బెంగాలీ నటుడు శాశ్వత ఛటర్జీ మెయిన్ విలన్‌గా నటిస్తున్నాడు.

